నిలకడగా సీఎం సోదరుడి ఆరోగ్యం

కొండాపూర్, మార్చి 7: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు అస్వస్థతతో హైటెక్ సిటీలోని మెడికవర్ దవాఖానలో చేరి, చికిత్స పొందుతున్నారు. జూబ్లీహిల్స్‌లో నివాసముండే తిరుపతిరెడ్డి నాలుగు రోజులుగా వైరల్ జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. గురువారం ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు ఆయనను మెడికవర్ దవాఖానలో చేర్పించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్‌రెడ్డి పర్యవేక్షణలో తిరుపతిరెడ్డికి చికిత్స అందిస్తున్నారు. పరీక్షల అనంతరం స్టంట్లు వేసినట్టు సమాచారం.

గ్యాస్ కేవైసీ గడువు పెంపు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): వంటగ్యాస్ వినియోగదారులకు సంబంధించి కేవైసీ గడువును మార్చి 31 వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు గ్యాస్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది.

కార్పొరేషన్ చైర్మన్లుగా బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, మార్చి7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఒబెదుల్లా కోత్వాల్ బాధ్యతలను స్వీకరించారు. నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పలువురు ముస్లిం ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు ఒబెదుల్లాను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా దీపక్‌జాన్ గృహకల్ప భవనంలోని కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. క్రైస్తవ మత పెద్దలు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆడపిల్లలు విద్యావంతులు కావాలి

బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాల మాయదేవి

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): ప్రతి ఆడపిల్ల విద్యావంతురాలు కావాలని, తద్వారా సమాజంలో మార్పు వస్తుందని బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాల మాయదేవి సూచించారు. గురువారం మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో బాల మాయాదేవి మాట్లాడుతూ లింగ వివక్ష లేకుండా పిల్లలను పెంచాల్సిన బాధ్య త తల్లిదండ్రులపై ఉన్నదని చెప్పారు. కార్యక్రమంలో ఎంజేపీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్యభట్టు, బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులు చంద్రశేఖర్, అలోక్‌కుమార్, సంధ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర సీడ్స్' ఎండీపై వేటు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చర్యలు

హైదరాబాద్, మార్చి 7(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ కేశవులుపై వేటు పడింది. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఆయనను ఎండీ బాధ్యతల నుంచి తప్పించి ఐఏఎస్ అధికారి హరితకు అదనపు బాధ్యతలను అప్పగించారు. వ్యవసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్లకు సంబంధించి గత పదేండ్ల పనితీరుపైనా మంత్రి విచారణకు ఆదేశించారు. గురువారం సచివాలయంలో కార్పొరేషన్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. కార్పొరేషన్ల నిర్ణయాలు, విధానాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి 10 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావును మంత్రి తుమ్మల ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో ఐదు కార్పొరేషన్లకు వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించగా, మరో ఐదింటికి కోఆపరేషన్ డైరెక్టర్‌ను నియమించారు. రాష్ట్ర హార్టికల్చర్ అభివృద్ధి కార్పొరేషన్ సంస్థకు డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్‌ను, టిస్కాబ్‌కు దాని కార్యదర్శిని స్వయంగా విచారణ జరపాలని నిర్ణయించారు.మరోవైపురాష్ట్ర సీడ్ కార్పొరేషన్‌లో ఎలాంటి అవకతవకలు జరగలేదని, తనపై వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలేనని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు తెలిపారు.

సీడ్ కార్పొరేషన్‌లో అవకతవకలు అవాస్తవం: కేశవులు

రాష్ట్ర సీడ్ కార్పొరేషన్‌లో ఎలాంటి అవకతవకలు జరగలేదని, తనపై వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలేనని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్‌పై, తనపై వచ్చిన వార్తలను ఆయన ఖండించారు.

గవర్నర్ తిరస్కరణ చెల్లదు

మొదటిపేజీ తరువాయి...

తిరస్కరించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. గత ఏడాది సెప్టెంబర్ 19న గవర్నర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ గురువారం తీర్పు చెప్పింది. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సిఫార్సు మేరకు ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్‌ను నియమిస్తూ గవర్నర్ తీసుకున్న నిర్ణయం మేరకు వెలువడిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా న్యాయస్థానం కొట్టివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం 73 పేజీల తీర్పు వెలువరించింది.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర మంత్రివర్గం గవర్నర్‌కు సిఫారసు చేసింది. రాజకీయ నేపథ్యం ఉన్నదంటూ ఆ పేర్లను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తిరస్కరిస్తూ గత ఏడాది సెప్టెంబర్ 19న ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులను దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ వేర్వేరుగా హైకోర్టులో సవాల్ చేశారు. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గం తాజాగా జనవరి 13న కోదండరాం, ఆమిర్ అలీఖాన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమిస్తూ సిఫారసు చేసింది. ఈ సిఫారసును గవర్నర్ వెంటనే ఆమోదించడంతో ప్రభుత్వం జనవరి 27న గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఓ వైపు తాము వేసిన పిటిషన్లపై విచారణ జరుగుతుండగానే గవర్నర్ మరో ఇద్దరిని తన కోటాలో ఎమ్మెల్సీలుగా ఎలా నియమిస్తారని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ మరోమారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ రెండు అంశాల మీద దాఖలైన పిటిషన్లపై సీజే ధర్మాసనం విచారణ జరిపి గురువారం తీర్పు వెలువరించింది.

గవర్నర్ తిరస్కరణ చెల్లదు

మంత్రివర్గ సిఫార్సులు, సూచనలకు గవర్నర్ కట్టుబడి ఉండాలని, ఆ సిఫార్సులపై ఏమైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు వాటిని వెనక్కి పంపాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎమ్మెల్సీలుగా నియమించాలని మంత్రివర్గం చేసిన సిఫార్సులను గవర్నర్ తిరస్కరించడం చెల్లదని తేల్చి చెప్పింది. 'దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణల నామినేషన్లను గవర్నర్ తిరస్కరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నాం' అని పేర్కొంది. 'ముందుగా ఈ రద్దు నిర్ణయం తీసుకున్నప్పుడు ప్రొఫెసర్ కోదండరాం, ఆమిర్ అలీఖాన్ల నియామకాలకు విలువ ఉండదు. కాబట్టి వారిద్దరు దాఖలు చేసిన నామినేషన్లు చట్టప్రకారం చెల్లవు' అని తెలిపింది.

ఎలాంటి నివేదికలూ లేవు

'పిటిషనర్లు ఇద్దరిపై క్రిమినల్ కేసులు, అనర్హతకు సంబంధించి నిఘా విభాగం సమర్పించిన నివేదికలు ఏమీ లేకపోయినా గవర్నర్ తిరస్కరణ నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గం సిఫారసులను వెనక్కి పంపి సందేహాలను నివృత్తి చేసుకునేలా సంబంధిత సమాచారం, పత్రాలను గవర్నర్ కోరాలి. లేదా పునఃసమీక్షించాలని కోరాలి. ఈ విధంగా చేయని కారణంగా దాసోజు, కుర్రా నామినేషన్లను తిరస్కరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నాం. ఆ తర్వాత మంత్రివర్గం జనవరి 13న కోదండరాం, అలీఖాన్లను నియమించాలనే తీర్మానంతోపాటు వాళ్లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ గత జనవరి 27న వెలువడిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది.

గవర్నర్‌కు ఉత్తర్వులు జారీ చేయలేం

గవర్నర్‌కు న్యాయస్థానాలు ఉత్తర్వులు జారీ చేయలేవని హైకోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని 361 అధికరణం ప్రకారం గవర్నరు కోర్టుకు జవాబుదారీకాదని తెలిపింది. ఈ కేసులోని పరిస్థితులు, వాస్తవాలను అనుసరించి గవర్నర్ తగిన చర్యలు తీసుకుంటారని భావిస్తున్నామని పేర్కొంది. సీఎం, క్యాబినెట్ సలహా లేకుండా గవర్నర్ సొంతంగా ఎప్పుడూ నిర్ణయం తీసుకునే అధికారం లేదని స్పష్టంచేసింది. గవర్నర్ తీసుకునే చర్యపై న్యాయసమీక్ష చేసేందుకు నిర్దిష్టమైన అడ్డంకులు ఏమీలేవని తెలిపింది. రాజ్యాంగంలోని 171(5) అధికరణ ప్రకారం గవర్నర్ మంత్రిమండలి నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని పేర్కొంది. మంత్రివర్గం సిఫారసులను పునఃసమీక్షించాలని పేర్కొంటూ ఫైల్‌ను వెనక్కి పంపే అధికారం గవర్నర్‌కు ఉంటుందని తెలిపింది.

కోర్టులకు గవర్నర్ జవాబుదారీ కాదు

గవర్నర్ కోర్టులకు జవాబుదారీ కాదని, అంతమాత్రాన గవర్నర్ దురుద్దేశపూరిత, వ్యక్తిగత చర్యలు, నిర్ణయాలు తీసుకుంటే.. వాటిపై న్యాయ సమీక్ష చేసేందుకు కోర్టులకు అధికారం ఉంటుంది అని హైకోర్టు తెలిపింది. రాజ్యాంగంలోని 171(5) అధికరణ ప్రకారం సాహిత్యం, సైన్స్, ఆర్ట్స్, సహకార ఉద్యమం, సామాజిక సేవల్లో అనుభవం ఉన్న వ్యక్తులను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసే అధికారం గవర్నర్‌కు ఉంటుందని వివరించింది. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుల మేరకు, రాజ్యాంగం ప్రకారం మంత్రివర్గం సలహాలు, సహకారంతోనే గవర్నర్ విధుల్ని నిర్వహించాలని, వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీల్లేదని తెలిపింది.

సమీక్షకు వీలుంది గానీ..

> 'గవర్నర్ సొంతంగా విచక్షణతో విధులు నిర్వహిస్తే అది చట్ట నిబంధనలకు అడ్డంకిగా ఉండకూడదు. ఎమ్మెల్సీలుగా మంత్రివర్గం చేసిన సిఫారసులను అన్ని పరిస్థితుల్లోనూ గవర్నర్ ఆమోదించాల్సిన బాధ్యత ఉండదు. మంత్రివర్గం సిఫార్సు చేసిన వాళ్లల్లో అనర్హులు ఉన్నారో లేదో సమీక్ష చేసే అధికారం గవర్నర్‌కు ఉంది. ఏమైనా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నా, ఆ వ్యక్తులు బెయిల్‌పై బయట ఉన్నా, తీవ్ర అభియోగాలు ఉన్న పరిస్థితుల్లో ఆ పేర్లను తిరిగి సమీక్ష చేయాలని సిపార్సులను మంత్రివర్గానికి వెనక్కి పంపవచ్చు' అని పేర్కొంది.

ఎలివేటెడ్ కారిడార్‌తో మెరుగైన రవాణా

- ఆరు జిల్లాల ప్రజలకు తగ్గనున్న ప్రయాణ సమయం
- ప్యాట్నీ – తూంకుంట కారిడార్‌కు శంకుస్థాపనలో సీఎం
- రక్షణశాఖ నుంచి భూముల సేకరణ పూర్తయిందని వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 7 (నమస్తే తెలంగాణ): ఉత్తర తెలంగాణలోని ఆరు జిల్లాల ప్రజల దశాబ్దాల కల త్వరలోనే నెరవేరబోతున్నదని, ఈ ప్రాంత అభివృద్ధికి మార్గాలు తెరుచుకోనున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్–రామగుండం రాజీవ్ రాహదారిలో పరేడ్ గ్రౌండ్ నుంచి తూంకుంట వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. అల్వాల్‌లోని టిమ్స్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ. 2,232 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ కారిడార్‌తో ఉత్తర తెలంగాణతోపాటు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని, వాహనదారుల ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. పరేడ్ గ్రౌండ్ నుంచి తూంకుంట వరకు, ప్యారడైజ్ నుంచి కండ్లకోయ వరకు కారిడార్ల నిర్మాణం పూర్తయితే ఆరు జిల్లాల ప్రజలకు ప్రయాణ సమయం, ఇంధన వ్యయ భారం తగ్గుతుందని అన్నారు. ప్రజావసరాలను పరిగణనలోకి తీసుకొని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ నుంచి భూములను సేకరించామని తెలిపారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పటి నుంచి ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని పలుమార్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. ఇటీవల తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ అంశంపై రాజ్‌నాథ్‌సింగ్‌తో మరోసారి చర్చించడంతో భూముల బదలాయింపు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఈ కారిడార్ నిర్మాణం పూర్తయితే నేరుగా ఓఆర్‌ఆర్ వరకు చేరుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తోపాటు, ఎంఏ యూడీ డైరెక్టర్ దానకిశోర్, హెచ్ఎండీఏ, రక్షణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్ రోడ్ నెం10లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

బంజారాహిల్స్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ భవన్ ప్రారంభం

బంజారాహిల్స్ : అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సుమారు నాలుగు దశాబ్దాలపాటు దేశరాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. బంజారాహిల్స్ రోడ్ నెం 10లో నిర్మించిన బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో దళితబహుజనులు ముందు వరుసలో ఉండి పోరాడారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును ఆమోదించే సమయంలో స్పీకర్‌గా ఉన్నది జగ్జీవన్‌రామ్ కుమార్తె మీరాకుమార్ అని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు మీరా కుమార్‌ను ఎన్నటికీ మర్చిపోరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, విప్ లక్ష్మణ్, ఎమ్మెల్యేలు సత్యనారాయణ, మందుల సామేలు, స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, దళిత సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పాతబస్తీ మెట్రో పనులకు శంకుస్థాపన

పాతబస్తీ మెట్రో పనులకు శుక్రవారం సాయంత్రం ఫలక్‌నుమా ఫరూఖ్‌నగర్ బస్ డిపో సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దారుల్‌షిఫా నుంచి మొదలై పురానీహవేలీ, ఐతెబార్ చౌక్, అలీజాకోట్ల, మీర్ మొయిన్ దైరా, హరిబౌలి, శాలిబండ, శంషేర్‌గంజ్, ఆలియాబాద్ మీదుగా ఫలక్‌నుమా ప్యాలెస్ వరకు 5.5 కి.మీ పొడవున మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు ఈ మార్గంలో నాలుగు మెట్రో స్టేషన్‌లు ఉంటాయి. ఈ మార్గం నిర్మాణానికి రూ.2వేల కోట్ల వ్యయం కానుంది.

ఎన్నికల్లో లబ్ధికోసమేనా?

> మొదటిదశలో ఉన్న పాతబస్తీ మెట్రోను మళ్లీ రెండో దశలో చేర్చడం, తాజాగా పాతబస్తీ మెట్రోలో 5.5 కిమీ మార్గానికి శంకుస్థాపన చేయడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో హడావుడిగా రెండో దశ మెట్రో ప్రాజెక్టు అంటూ పాతబస్తీ మెట్రోను 5.5 కిమీ మేర మాత్రమే నిర్మించేందుకు శంకుస్థాపన ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో జరిగే ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకే రెండోసారి శంకుస్థాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీఎం పర్యటనలో నిరసన తెలుపుతున్న మేడ్చల్ మెట్రో సాధన సభ్యులు

ఎలివేటెడ్ 'కారిడార్'లో మెట్రో గల్లంతు!

మొదటిపేజీ తరువాయి...

సాధన సమితి సభ్యులు విమర్శించారు. గత ఐదు దశాబ్దాలుగా రక్షణశాఖతో ఉన్న భూ తగాదాలను పరిష్కరించానని చెప్పుకుంటున్న సీఎం బహుళ ప్రయోజనాలను ఎందుకు మరిచిపోయారని మండిపడుతున్నారు. అల్వాల్‌లోని టిమ్స్ ప్రాంగణంలో సీఎం కారిడార్‌కు శంకుస్థాపన చేస్తున్న సమయంలో ఆందోళనకారులు మెట్రో విస్తరణపై నిర్ణయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 'వుయ్ డిమాండ్ మేడ్చల్ మెట్రో' అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు.

డబుల్ డెక్కర్‌పై స్పష్టత కరువు

హెచ్ఎండీఏ అధికారులు ప్రదర్శించిన ప్రాజెక్టు వివరాలపై సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో భవిష్యత్తులో మెట్రో విస్తరణ సాధ్యపడదని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు కారిడార్‌తోపాటు మెట్రో రైలు కూడా ప్రయాణించేందుకు వీలుగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లను ప్రతిపాదించిందని వారు గుర్తు చేశారు. ఉత్తర తెలంగాణతోపాటు, ఓఆర్‌ఆర్ సమీపంలో ఉన్న ఫార్మా క్లస్టర్ జీనోమ్ వ్యాలీ వరకు మెరుగైన రవాణా సదుపాయాలను సమకూర్చడంలో.. ఎలివేటెడ్ కారిడార్ అత్యంత కీలకం కానుంది. నగరానికి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓఆర్‌ఆర్ అవతలి వరకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రయాణించేందుకు ఈ మార్గం దోహదపడనుంది. భవిష్యత్తులో శామీర్‌పేట్ వరకు మెట్రో రైలును విస్తరించనున్న నేపథ్యంలో ఈ కారిడార్‌పైనే మెట్రో మార్గాన్నికూడా నిర్మించాలని కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ రేవంత్‌రెడ్డి పాత ప్రతిపాదనలేవీ పరిగణనలోకి తీసుకోకుండానే.. ఎలివేటెడ్ కారిడార్ పేరిట ఫ్లైఓవర్ నిర్మించి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని ఆందోళనకారులు మండిపడ్డారు. పాత ప్రతిపాదనలను పక్కన పెట్టేయడంతో హైదరాబాద్ నార్త్‌జోన్ ప్రజలకు తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూపొందించిన ప్రతిపాదనల ప్రకారమే భూ సేకరణ, డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కాలేజీ కూల్చివేత

మొదటిపేజీ తరువాయి...

యాజమాన్యం అక్రమంగా నిర్మాణాలను చేపట్టిందనే ఆరోపణపై ఈ చర్యకు పాల్పడ్డారు. గురువారం ఉదయమే పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలతో అక్కడకు చేరుకున్న రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదలశాఖ అధికారులు బ్రేకర్లు, జేసీబీల సహాయంతో తొలుత ఒక భవనం గ్రౌండ్‌ఫ్లోర్ మొత్తం కూల్చివేశారు. అదే సమయంలో కళాశాల విద్యార్థులు ఒక్కసారిగా అక్కడకు దూసుకొచ్చి జేసీబీలకు అడ్డుగా నిలిచారు. ఉద్రిక్త వాతావరణం ఏర్పడడంతో అధికారులు కొద్ది సేపు కూల్చివేతలను నిలిపివేశారు. అనంతరం కళాశాల తరగతులకు సెలవు ప్రకటింపజేసి విద్యార్థులను అక్కడి నుంచి పంపించివేశారు. మరోవైపు అప్పటికే అక్కడికి కళాశాల యజమాని, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, బీ లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు చేరుకున్నారు. అనంతరం గడువు కోరేందుకు అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లారు. ఇంతలో అధికారులు పోలీసుల బందోబస్తుతో భవనం రెండో అంతస్థును కూడా కూల్చివేశారు. కళాశాల యాజమాన్యం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేయడంతో దానిని పరిశీలించిన న్యాయమూర్తి తాత్కాలికంగా కూల్చివేతలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

ప్రభుత్వాని ది కక్ష సాధింపు చర్య: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కేసులు నమోదుచేయించి బెదిరింపులకు దిగుతున్నదని విమర్శించారు. తాము అక్రమణలను సమర్థించడం లేదని, ఏదైనా పద్ధతి ప్రకారం జరగాలని స్పష్టంచేశారు. సోమవారం వరకు కూల్చివేతలు చేపట్టొద్దని స్టాండింగ్ కమిటీ సూచించినప్పటికీ, ఆగమేఘాల మీద కూల్చివేతలు చేపట్టడమేమిటని ప్రశ్నించారు. ఇదంతా సీఎం రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయం కనుసన్నల్లోనే జరుగుతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎక్కడా అక్రమ నిర్మాణాలు చేపట్టలేదా? వాటిని ఎప్పుడు కూల్చుతారు? అని ప్రశ్నించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమించలేదు : మర్రి రాజశేఖర్‌రెడ్డి

కాలేజీ నిర్మాణాలకు అన్ని అనుమతులు పొందినప్పటికీ మున్సిపల్ అధికారులు కూల్చివేతలకు పాల్పడటం ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యగానే భావిస్తున్నామని మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తాము ఎక్కడా ప్రభుత్వ భూములు ఆక్రమించలేదని చెప్పారు. 1995లో మొత్తం 50 ఎకరాలు కొనుగోలు చేసి అప్పటి గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. తిరిగి 2015లో హెచ్ ఎండీఏ అనుమతుల కోసం రూ.95 లక్షలు ఫీజు చెల్లించి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేశామని, ఆ కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్నదని వివరించారు. వారం క్రితం తమకు నోటీసులు ఇవ్వగా దానికి సమాధానం ఇచ్చామని, అయితే మళ్లీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారని చెప్పారు. తాము కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదని, మరోవైపు కూల్చివేతలను తీవ్రతరం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసే ప్రయత్నం చేయగా, ఆయన అందుబాటులో లేరని, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిశామని తెలిపారు. అన్ని అనుమతులు ఉన్నప్పటికీ అన్యాయంగా జరుగుతున్న కూల్చివేతలు ఆపాలని కోరామని చెప్పారు. విద్యాసంస్థ ఫౌండర్ చైర్మన్ హోదాలోనే తాము వేం నరేందర్‌రెడ్డిని కలిశామని, దీనిని రాజకీయ కోణంలో చూడొద్దని కోరారు.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి

గవర్నర్‌కు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై హైకోర్టు తీర్పు చరిత్రాత్మకమైనదని బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తీర్పును దృష్టిలో ఉంచుకుని, ప్రజా జీవితంలో అంకితభావంతో కూడిన పోరాటాలు, త్యాగాలు, గణనీయమైన సేవలను గుర్తించాలని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌కు విజ్ఞప్తి చేశారు. తమ నేపథ్యాలు, జీవితకాల కృషి, సామాజికసేవ, కళ, సాహిత్యరంగాలకు అందించిన సేవలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (5) లో పేర్కొన్న అర్హత ప్రమాణాలకు సరిగ్గా సరిపోతాయని తెలిపారు. తాము సమాజంలోని అత్యంత వెనుకబడినవర్గాల నుంచి వచ్చామని, తమలాంటి నేపథ్యాలున్నవారికి శాసనసభలో ప్రాతినిధ్యం వహించే అవకాశాలు చాలా అరుదని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుతోపాటు రాజ్యాంగ నిబంధనలకు లోబడి ఉన్న తమ అర్హతలను దృష్టిలో ఉంచుకుని, 2023 జూలైలో మంత్రిమండలి చేసిన సిఫార్సులను పరిగణనల